సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 27 । జూన్ । 2024



లెక్క.. ఇక పక్కా

దివ్యాంగుల్లో మార్పు తెచ్చే సంకల్పానికి అడుగు పడుతోంది.. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్య అందించేందుకు ప్రతి భవిత కేంద్రం సిద్ధమైంది.


8లో



నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,00,001 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం చుండూరి శ్రీనివాసరావు, వనజ దంపతులు (తణుకు) రూ.1,00,001 విరాళం అందజేశారు.

డెల్టాలకు 9,550 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 9,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.95 అడుగులకు చేరింది.

సాధారణ బదిలీలు

- కరెంటాఫీస్‌లో ట్రాన్స్‌ఫర్ల కలకలం
- రాజమహేంద్రవరం సర్కిల్‌లో కీలక అధికారిని విశాఖకు బదిలీ చేసే అవకాశం
- ఆయన స్థానంపై పలువురి కన్ను
- మాజీ మంత్రి జవహర్ ద్వారా పైరవీలు
- మరో అధికారి సైతం విశ్వ ప్రయత్నాలు
- పదేళ్లుగా ఒకే స్థానంలో పాతుకుపోయిన ఓ అధికారిణి
- ప్రస్తుతం బదిలీ తప్పదనడంతో ఇక్కడే మకాం వేసేందుకు ఎత్తులు



రాజమహేంద్రవరంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) శాఖలో బదిలీలు చేపట్టనున్న నేపథ్యంలో తమకు అనుకూలమైన స్థానాలను దక్కించుకునేందుకు పలువురు ఉద్యోగులు పావులు కదుపుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో బదిలీలు చేపట్టడం సర్వ సాధారణం. దీనికితోడు ఏపీఈపీడీసీఎల్ శాఖలో రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో సాధారణ బదిలీలకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. ఈసారి పెద్ద ఎత్తున మార్పులు ఉంటాయని ఆ శాఖ అధికారుల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్న రాజమహేంద్రవరం సర్కిల్‌పై కొందరు ఉద్యోగులు కన్నేశారు. ఎలాగైనా ఇక్కడ స్థానం దక్కించుకోవాలని వ్యూహాలు రచిస్తున్నారు. ఇందుకు తమకు పరిచయం ఉన్న టీడీపీ నేతలను ఆశ్రయిస్తున్నారు. వారి ద్వారా పైరవీలు చేస్తున్నారు. ఇక్కడ జీతం కంటే గీతం దండుకునే ఆస్కారం ఎక్కువగా ఉండటంతో డిమాండ్ ఏర్పడింది. ఎలాగైనా సీటును కైవసం చేసుకునేందుకు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు సమాచారం.

విశాఖ కార్యాలయంపై కన్ను

ప్రస్తుతం రాజమహేంద్రవరం సర్కిల్ ఏపీఈపీడీసీఎల్‌లో కీలకంగా వ్యవహరిస్తూ సుమారు మూడున్నరేళ్లుగా పనిచేస్తున్న అధికారి ప్రస్తుతం పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారు. విశాఖపట్నంలోని ఆ శాఖ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎం ఓఅండ్‌సీఎస్ (ఆపరేషన్ కన్జూమర్ సర్వీసెస్) పోస్టు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎస్‌ఈ ఆపరేషన్స్ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంగా పదోన్నతి వరించనుంది. ఆగస్టులో వెళ్లాల్సి ఉంటుంది. అంతకంటే ముందుగానే వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం కొన్ని మాసాలుగా తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. విద్యుత్ శాఖలో ఆ పోస్టుకు అత్యంత డిమాండ్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, సామగ్రి సరఫరా కేటాయింపు తదితర కీలకమైన విషయాల్లో ఈ పోస్టు కీలకం. సదరు పోస్టుకు పలువురు పైరవీలు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

- ప్రస్తుతమున్న ఆ అధికారి బదిలీపై వెళ్తే రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయానికి వచ్చేందుకు విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరు నువ్వా..? నేనా..? అని పోటీ పడుతున్నట్టు సమాచారం.
- ఇద్దరిలో ఒకరు మాజీ మంత్రి జవహర్‌కు సమీప బంధువు కావడంతో ఆయన ఎంపిక లాంఛనమే అన్న వాదన ఆ శాఖ ఉద్యోగుల్లో బలంగా వినిపిస్తోంది. ఈయన గతంలో రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో డీఈగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం పదోన్నతి పొందారు. విశాఖలోని కార్పొరేట్ కార్యాలయంలో జీఎం కాల్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. మరొకరు విశాఖ కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇక్కడకు వచ్చేందుకు తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నట్టు తెలిసింది.

ఫెవికాల్ వీరులకు చెక్ పడేనా?

- రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని విద్యుత్ శాఖలో కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ట వేశారు. అక్రమాదాయం ఉండటంతో బదిలీల సమయంలో ఉన్నతాధికారులకు అమ్యామ్యాలు సమర్పించి తమ స్థానాలు పదిలం చేసుకుంటున్నారు. అలాంటి అధికారులకు ప్రస్తుతం చెక్ పడే అవకాశం ఉన్నట్టు ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.
- సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఐదేళ్లుగా ఇదే సర్కిల్‌లో పాతుకుపోయారు. అంతా తన కనుసన్నల్లో నడిచేలా చేస్తున్నారు. ప్రస్తుతం ఆ స్థానానికి ఎసరు తప్పదని తెలుస్తోంది. పదేళ్లుగా తిష్టవేసిన అధికారిని ఏలూరు సర్కిల్‌కు బదిలీ చేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.
- ఏలూరు సర్కిల్ పరిధిలో ఉన్న సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ రెవెన్యూ వీరిద్దరూ జేఏఓ(జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్)నుంచి ఐదేళ్లకు పైగా ఇదే సర్కిల్‌లో పాతుకుపోయారు. వీళ్లని సైతం రాజమహేంద్రవరం సర్కిల్‌కు బదిలీ చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.
- డీఈ టెక్నికల్ పదేళ్లుగా ఇదే సర్కిల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెను సైతం ఏలూరు సర్కిల్‌కు బదిలీపై సాగనంపేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే ఏలూరు సర్కిల్‌లో డీఈగా(టెక్నికల్) 25 ఏళ్లుగా అక్కడే కొనసాగుతున్న ఓ అధికారిణికి సైతం ఈ సారి స్థానచలనం తప్పదన్న వాదన వినిపిస్తోంది. రాజమహేంద్రవరం సర్కిల్‌కు సాగనంపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే బదిలీలను ఎలాగైనా తప్పించుకునేందుకు సదరు ఫెవికాల్ వీరులు పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమను ఎలాగైనా గట్టెక్కించాలని, అందుకు అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేస్తామని విన్నవించుకుంటున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రజాప్రతినిధులు అందినకాడికి దండుకుంటున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఏలూరు సర్కిల్‌లో గత ఐదేళ్లుగా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఏఓ రెవెన్యూగా ఉన్న అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ ఉద్యోగులపై వారు వ్యవహరించే తీరును ఎండగడుతున్నారు. నానా మాటలు అంటూ అవమానాలకు గురిచేస్తున్నారని, ఆ ఇద్దరు ఉద్యోగులను ఇక్కడి నుంచి పంపేయాలన్న డిమాండ్ ఉంది. కేవలం ఉద్యోగులే కాకుండా ఉద్యోగ సంఘాలు, కార్మికులు, విద్యుత్ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు సైతం వీరిని బదిలీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆ శాఖ సీఎండీకి సైతం ఫిర్యాదు చేశారు. ఆరోపణలు మూటగట్టుకున్న సదరు ఉద్యోగులను ఈ సారైనా తప్పిస్తారా? లేదా? చూడాల్సి ఉంది.

దూసుకుపోతున్న పొగాకు మార్కెట్

- రోజురోజుకూ పెరుగుతున్న ధర
- రైతుల్లో వెల్లువెత్తుతున్న ఆనందం
- కిలో గరిష్ట ధర రూ. 363
- కనిష్ట ధర రూ. 240
- సగటు ధర రూ. 302

దేవరపల్లి: పొగాకు మార్కెట్ దూసుకుపోతోంది. వేలం కేంద్రాల్లో కొనుగోలు దారులు దూకుడు పెంచడంతో ఎవరూ ఊహించని విధంగా ధర పలుకుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న ధర పట్ల రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ ఏర్పడడం, ఎగుమతి ఆర్డర్లు రావడం, అవసరా మేరకు ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి లేకపోవడం, జింబాబ్వే, బ్రెజిల్ దేశాల్లో ఉత్పత్తి గణనీయంగా పెరగడం వంటి కారణాలతో మన పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. గత వారం రోజుల నుంచి మార్కెట్లో పొగాకు ధర పెరుగుతూ వస్తోంది. ఎకరా దిగుబడి తగ్గినప్పటికీ సాగు విస్తీర్ణం పెరగడంతో ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో 200 మిలియన్ల కిలోలు, మన జిల్లాలోని రెండు వేలం కేంద్రాలతో పాటు ఏలూరు జిల్లాలోని మూడు వేలం కేంద్రాల పరిధిలో 67 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 6న ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించగా, దాదాపు రెండు నెలలు కొనుగోళ్లు మందకొడిగా జరిగాయి. మొదటి రెండు నెలలు రైతులు లోగ్రేడు పొగాకును చాలావరకు అమ్ముకున్నారు. లోగ్రేడు పొగాకు కిలో రూ.270కు అమ్ముడుపోయింది. మే నెల రెండవ వారం వరకు మార్కెట్ మందకొడిగా జరగ్గా, ఎన్నికల అనంతరం ఊపందుకుంది. ప్రస్తుతం పొగాకు ధర రికార్డు స్థాయికి చేరుకుంది. బుధవారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.363, కనిష్ట ధర రూ.240, సగటు ధర రూ. 302 పలికింది. సోమవారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.337 ఉండగా, మంగళవారం రూ.352 లభించింది. ఈ ధర మరొక వారం రోజుల్లో రూ.400 అవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ధర గరిష్ట స్థాయికి చేరుకోవడంపై పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రభావం 2024–25 సాగుపై పడుతుందని, ఇప్పటికే భూముల కౌలు, బ్యార్నల అద్దెలు రెట్టింపు పలుకుతున్నాయని అంటున్నారు. కొనుగోళ్లు ప్రారంభించి 110 రోజులు కాగా, 85 రోజులు వేలం జరిగింది. ఇప్పటి వరకు ఐదు వేలం కేంద్రాల్లో 30.20 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. రానున్న రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పది సప్లిమెంటరీ ఫలితాల విడుదల

86.51 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత

రాయవరం: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని కనబర్చింది. 86.51 శాతం ఫలితాలతో రాష్ట్ర స్థాయి రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది పదో తరగతి రెగ్యులర్ ఫలితాలు మార్చి 22న విడుదల కాగా, 91.88 శాతం ఉత్తీర్ణతా శాతంతో రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచిన విషయం పాఠకులకు విదితమే. ఇదిలా ఉంటే సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1,950 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,687 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,213 మంది బాలురకు 1,036 మంది, 737 మంది బాలికలకు 651 మంది పాసయ్యారు. బాలురు 85.41 శాతం, బాలికలు 88.33 శాతం ఉత్తీర్ణత దక్కించుకున్నారు.

నాలుగు రోజుల్లో జాబితా

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ప్రస్తుతానికి ప్రొవిజనల్‌గా మాత్రమే పరిగణిస్తారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సుల్లో ప్రవేశాన్ని సులభతరం చేసేందుకు నాలుగు రోజుల తర్వాత మార్కుల జాబితాలు అధికారిక వెబ్‌సైట్ www.bse.gov.inలో అందుబాటులో ఉంచనున్నారు. సంబంధిత హెచ్ఎం స్కూల్ లాగిన్ నుంచి పాఠశాలల వారీగా మార్కుల మెమోరాండం మరియు వ్యక్తిగత షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు సంబంధిత పాఠశాలలకు వెళ్లకుండానే నేరుగా అధికారిక వెబ్‌సైట్ నుంచి వారి ఫలితాలు, షార్ట్ మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎనీమియా ముక్తభారత్ అమలుపై పరిశీలన



తన కార్యాలయంలో కేంద్ర బృంద సభ్యులతో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్/రాజానగరం: ఎనీమియా ముక్తభారత్ జిల్లాలో అమలు జరుగుతున్న తీరుపై కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్.పూజ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను పరిశీలించి, అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజానగరం మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు జితేంద్రసింగ్, ఎస్.పూజలు ప్రోగ్రాం ఆఫీసర్లతో కలిసి ఎనీమియా ముక్త భారత్ పని తీరు అమలు గురించి వైద్యులు బెండిక్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలకు అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు గురించి, అంగన్‌వాడీ సెంటర్‌లో ఐదేళ్లలోపు పిల్లలకు వారానికి రెండుసార్లు ఇచ్చే ఐఎఫ్ఏ సిరప్‌ల గురించి తెలుసుకున్నారు. అక్కడి నుంచి శాటిలైట్‌సిటీలోని విలేజ్ హెల్త్ క్లినిక్, అంగనవాడీసెంటర్‌లో అమలవుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రక్తహీనత నివారణే లక్ష్యంగా ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, పప్పు దినుసులు వంటి బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకునే విధంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద సభ్యులు రంజిత్‌సింగ్, ఎస్.పూజ మాట్లాడుతూ రక్తహీనతను పూర్తిగా అరికట్టడానికి చిన్నపిల్లలు, కౌమార దశలో ఉన్న పిల్లలు, గర్భిణులను గుర్తించి ఐఎఫ్ఏ మందులను అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎనీమియా తీవ్రంగా ఉన్న కేసులను గుర్తించి వారికి ఐరన్ సుక్రోస్‌ను సెలైన్ ద్వారా ఎక్కించాలని సూచించారు. మరింత తీవ్ర స్థాయిలో ఉన్న కేసులను రెఫరల్ ఆసుపత్రికి పంపించాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎన్. రాజకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మౌనిక, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఫెర్రీ వేలం పాట వాయిదా

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పురుషోత్తపట్నం – పోలవరం ఫెర్రీ వేలంపాట రసాభాసతో వచ్చే నెల 9వ తేదీకి వాయిదా పడింది. బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లాల ఫెర్రీ కమిటీ సభ్యులైన సీతానగరం ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పోలవరం ఎంపీడీవో శ్రీను, ఎంపీపీ వెంకటరెడ్డి సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఫెర్రీ వేలంపాట నిర్వహించడానికి సిద్ధమయ్యారు. మూడు టెండర్లు రాగా వాటిలో రెండు ఆమోదం పొందాయి. నియమ, నిబంధనలకు అనుకూలంగా లేకపోవడంతో ఒక టెండర్‌ను తిరస్కరించారు. తమ టెండరును తిరస్కరించడంపై వారు అభ్యంతరం తెలుపుతూ విరుచుకుపడటంతో ఫెర్రీ వేలంపాట రసాభాసగా మారింది. దీంతో వేలంపాట వచ్చే నెల 9వ తేదీన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు ప్రకటించారు. గత ఏడాది పురుషోత్తపట్నం – పోలవరం ఫెర్రీ వేలంపాట రూ.12.69 లక్షలకు వెళ్లింది.

జోరుగా ఖరీఫ్ సాగు పనులు



పసలపూడిలో వరి నారుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

- జిల్లాలో 3,404 ఎకరాల్లో నారుమడులు
- వ్యవసాయాధికారి బోస్‌బాబు వెల్లడి

రాయవరం: జిల్లాలో ఖరీఫ్ సాగు పనులు చురుగ్గా జరుగుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు తెలిపారు. మండలంలోని పసలపూడి గ్రామంలో పంట పొలాలను బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ జిల్లాలో 1,68,780 ఎకరాల్లో వరి సాగును రైతులు చేపడుతున్నారన్నారు. వరి నాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 3,404 ఎకరాల్లో వరి నారుమడులు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా నారుమడులు వేసుకోని రైతులు వెదజల్లు విధానంలో వరి సాగు చేపట్టాలన్నారు. ప్రస్తుతానికి 1,764 ఎకరాల్లో వెదజల్లు విధానంలో రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. దీనివల్ల సమయం వృథా కాదన్నారు. జిల్లాలో 541 ఎకరాల్లో రైతులు సాధారణ వరినాట్లు వేశారన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ప్రధాన పొలంలో నాట్లు వేసిన నెల రోజుల వరకూ ఎటువంటి తెగుళ్లు, పురుగు ఆశించదన్నారు. తద్వారా పెట్టుబడిని ఆదా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా వరి విత్తనాలు సిద్ధం చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలు ఉన్నాయన్నారు. రైతులు విత్తన శుద్ధి చేయడంతో పాటు, మొలక శాతాన్ని పరీక్షించుకున్న తర్వాతే విత్తనాలు చల్లుకోవాలన్నారు. ఆర్‌బీకేలు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్ల వద్ద అన్ని రకాల ఎరువులు కలుపుకొని 43,642 మెట్రిక్ టన్నుల ఉన్నాయని బోసుబాబు తెలిపారు. అంతకు ముందు ఆయన క్షేత్ర స్థాయిలో రైతులతో మాట్లాడారు. నారుమడుల సస్యరక్షణ, వరి నాట్ల అనంతరం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి కొప్పిశెట్టి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

రాయవరం: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. ఇందులో జిల్లాలో మొత్తం 31 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు మే నెలలో జరిగిన సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 3,745 మంది పరీక్షలకు హాజరు కాగా, 1,143 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఒకేషనల్ పరీక్షలకు 763 మంది హాజరు కాగా, 291 మంది ఉత్తీర్ణత పొందారు. ఈ నెల 18న ఇంటర్ సెకండియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన విషయం పాఠకులకు విదితమే.

చిరుజల్లు కురిసె..



అమలాపురంలో వానజల్లు

సాక్షి, అమలాపురం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో బుధవారం సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఉపరితల ఆవర్తనంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే సముద్ర తీరం వెంబడి పలుచోట్ల 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉదయం వేసవిని తలపించే ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు సాయంత్రం వేళ వాతావరణం మేఘావృతమై చినుకులు పడడంతో సేద తీరారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని ఆవిష్కరిద్దాం..



డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

- ఇందులో యువత పాత్ర కీలకం
- జిల్లా ఎస్పీ శ్రీధర్ వెల్లడి

అమలాపురం టౌన్: డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణలో నేటి యువత పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ తెలిపారు. తద్వారా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ డ్రగ్స్ రహిత దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) జిల్లా విభాగం ఆధ్వర్యంలో అమలాపురంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బుధవారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని ఎస్పీ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు నేటి యువత పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కలిగి ఉన్న వ్యక్తుల గురించి లేదా అక్రమ రవాణా సమాచారం తెలిసినా తక్షణమే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. ఎస్‌ఈబీ జిల్లా ఇన్‌చార్జి, జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వల్ల చెడు వ్యసనాల బాట పట్టిన యువకులు ఉండకూడదని, మంచి అలవాట్లతో యువత సన్మార్గంలో వెళుతోందన్న మంచి సందేశంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమరబాబు, జిల్లా ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.విజయసారథి మాట్లాడుతూ డగ్స్ రహితం కోసం జిల్లా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జిల్లా పోలీస్ శాఖ, ఎస్‌ఈబీ విభాగాలకు సమాచారం అందించే విధి విధానాలను వివరించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి ర్యాలీ 216 జాతీయ రహదారి మీదుగా గడియారం స్తంభం సెంటర్ వరకూ సాగింది. అమలాపురం ఎస్‌ఈబీ సీఐ ఎస్.సాయిస్వరూప్, జిల్లా ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచ్ సీఐ బి.రాజశేఖర్, జిల్లా సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వర్లు, అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పాల్గొన్నారు. ర్యాలీలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, జన కల్యాణ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణకు నినాదాలు చేశారు.

ఫలం.. మహా ప్రియం

- అందనంత దూరంలో ధరలు
- వర్షాభావంతో తగ్గిన దిగుబడులు
- డిమాండ్ ఏర్పడడంతో పండ్లకు రెక్కలు

కాకినాడ సిటీ: యాపిల్ ధర అందనంటోంది.. దానిమ్మ దరిదాపుల్లోకి రానంటోంది.. బొప్పాయి బాబోయ్ అనేట్టు ఉంది.. బత్తాయి భారం అయ్యింది.. మామిడి మిక్కిలి ప్రియమైంది.. అరటి అందనంత దూరానికి వెళ్తోంది.. ఇలా ఏ పండ్లను చూసినా కన్నీరు వస్తోంది.. ఒకపక్క భానుడు నిప్పులు కురిపిస్తుంటే, నిస్సత్తువ ఆవరించకుండా పోషక విలువలున్న తాజా పండ్లు తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నా ఎక్కడా వీటి ధరలు తగ్గడం లేదు. మార్కెట్‌లో పండ్ల ధరలన్నీ కొండెక్కి కూర్చున్నాయి. మండుతున్న ఎండలకు తగ్గట్టే మార్కెట్‌లో వీటి ధరలూ సెగలు పుట్టిస్తున్నాయి. ఏ రకమైన పండ్లు కొనాలన్నా వందల్లో ధర ఉండడం శోచనీయం.

పెరిగిన వినియోగం

వ్యక్తిగత ఆరోగ్యం కోసం, పూజలు, బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు పండ్లు కొనుగోలు చేస్తుంటాం. పోషక విలువలు ఎక్కువగా ఉన్న తాజా పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని వైద్యులు పదే పదే చెబుతున్నారు. పైగా కరోనా తర్వాత పండ్ల వినియోగం పెరిగింది. మండుతున్న ఎండలు, పడుతున్న వర్షాలను సాకుగా చూపుతూ వ్యాపారులు ధరలు అమాంతం పెంచేస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కాకినాడలో ఆర్టీసీ బస్టాండ్, బాలాజీ చెరువు, ఆర్డీఓ కార్యాలయం రోడ్డు, భానుగుడి, సంత మార్కెట్ సెంటర్, జగన్నాథపురం వంతెన, ఇంద్రపాలెం వంతెన, బోట్‌క్లబ్, రమణయ్యపేట మార్కెట్, కాకినాడ–పిఠాపురం ప్రధాన రహదారి, జగ్గంపేట, తుని, అన్నవరం, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, యానాం, తాళ్లరేవుల్లో పండ్ల దుకాణాల్లో ద్వారా ఎక్కువగా వ్యాపారాలు జరుగుతుంటాయి.

మార్కెట్‌లో మంట..

మార్కెట్‌లో దేశ, విదేశీ రకాల పండ్లు అందుబాటులో ఉన్నా వాటి ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పరిమాణాన్ని బట్టీ డజను యాపిల్ రూ. 250 నుంచి రూ. 300 వరకూ, దానిమ్మ రూ. 200 నుంచి రూ. 250, సుగంధ అరటి పండ్లు రూ.60 నుంచి రూ. 80, నల్ల ద్రాక్ష కిలో రూ.120 నుంచి రూ.150, పుచ్చకాయ కిలో రూ. 35, బొప్పాయి కిలో రూ. 40, డ్రాగన్ ఫ్రూట్ ఒక్కొటి రూ.100, నేరేడు పండ్లు పావు కిలో రూ.80 నుంచి రూ.100, పనస తొనలు డజను రూ.50 నుంచి రూ.70, బత్తాయి 5 కాయలు రూ.100కు విక్రయిస్తున్నారు. దీంతో పండ్ల ధరలు అందుబాటులో లేక వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్ల ద్వారా పండ్ల వినియోగం పెరగడంతో ధరలకు రెక్కలు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.



కాకినాడలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల పండ్లు

కాలంతో సంబంధం లేకుండా..



ప్రస్తుతం పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. ఆఖరికి వేసవిలో దొరకే పుచ్చకాయ, బొప్పాయి ధరలు సైతం పెరిగిపోయాయి. కోవిడ్ అనంతరం ప్రజలు ఇమ్యూనిటీని పెంచుకునేందుకు వేసవి, వర్షాకాలం అనే కాలాలతో సంబంధం లేకుండా వివిధ రకాల పండ్లను కొనుగోలు చేయడం, ఫ్రూట్ జ్యూస్‌లకు డిమాండ్ ఉండడంతో ధరలు పెరుగుతున్నాయి.

–బొమ్మిడి శ్రీనివాస్, పగడాలపేట, తూరంగి

అమాంతం కొండెక్కాయి



పండ్లు కొనుగోలు చేసే వినియోగదారుల సంఖ్య అధికమైంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి తగ్గి డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు అమాంతం కొండెక్కాయి. ఖర్చు విపరీతంగా పెరగడంతో దానికి అనుగుణంగానే తగ్గించి అమ్మకాలు జరుపుతున్నాం.

–కరుణ, పండ్ల వ్యాపారి, కాకినాడ

చూడండి పశువుల సంరక్షణ

- ఎదకు వస్తే జాగ్రత్తలు తప్పనిసరి
- పోషక దాణా ఎంతో అవసరం



సీహెచ్ వెంకటనారాయణ, పశు సంవర్ధక శాఖ ఏడీ

కొత్తపేట: వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ రైతులకు అదనపు ఆదాయాన్ని ఇస్తోంది.. పశువుల సంరక్షణలో జాగ్రత్తలు పాటిస్తే సిరులు పొందవచ్చు.. ముఖ్యంగా చూడి పశువుల విషయంలో అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యకర దూడను, నాణ్యమైన పాల దిగుబడితో మంచి ఆదాయం సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. వేసవి కాలం గడిచింది. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పశువులు ఎక్కువగా ఎదకు వస్తాయి. ఆ సమయంలో చూడి కట్టిన తరువాత నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ ఏడీ, కొత్తపేట ప్రాంతీయ పశు వైద్యశాల వైద్యాధికారి సీహెచ్ వెంకటనారాయణ వివరించారు.

ఇలా గుర్తించండి...

పాడి పశువుల పునరుత్పాదక శక్తి పశువుల పునరుత్పత్తి సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. పాడి పశువుల్లో ఎదను సరైన సమయంలో గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించడం అతి ముఖ్యం. ఇలా చేయడం వల్ల ఈతల మధ్య వ్యవధి తగ్గి పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుంది. యుక్త వయసు వచ్చిన ఆడ పశువుల అండాశయంలో ఉత్పత్తయిన హార్మోన్ల వల్ల అసహజమైన లక్షణాలను ప్రదర్శిస్తాయి. దానినే ఎద అని అంటారు.



పాడి-పంట

పశువు ఎదకు వచ్చినప్పుడు మగ పశువులతో గర్భధారణ చేయించడం అనేది పూర్వకాలం నుంచీ ఉన్న పద్ధతి. కానీ కొన్నేళ్లుగా పశుసంవర్ధక శాఖ కృత్రిమ గర్భధారణను ప్రోత్సహిస్తుంది. మేలు జాతి మగ పశువుల వీర్యాన్ని పరికరాల సహాయంతో శాస్త్రీయ పద్ధతిలో సేకరించి ఆడ పశువు గర్భకోశంలో సకాలంలో ప్రవేశపెట్టి గర్భం ధరించేటట్టు చేసే ప్రక్రియనే శాస్త్రీయ గర్భోత్పత్తి లేదా కృత్రిమ గర్భధారణ అంటారు. దేశవాళీ పశువులు 3–4 ఏళ్ల వయసులో ఎదకు వచ్చి 4–5 ఏళ్ల వయసులో మొదటి ఈత ఈనుతాయి. అదే సంకర జాతి పశువులు అయితే రెండేళ్లలోపు ఎదకు వచ్చి మూడేళ్ల లోపు తొలి ఈతకు వస్తాయి.

ముందు జాగ్రత్తలు ఇవీ..

- **ఈతకు ముందు పశువు శరీరం, పరివర్తనలో స్వల్ప మార్పులు వస్తాయి. ఈనడానికి రెండు వారాల ముందు పొదుగు పెరుగుతుంది.** కొన్ని సందర్భాల్లో పొదుగు నుంచి పాలు కారుతుంటాయి. పశువు ఆందోళనగా ఉండి మేత మేయదు. ఆ సమయంలో పశువు ఈనడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాలి.
- ఈనడానికి వారం ముందు నుంచి చూడి పశువును మిగిలిన పశువుల నుంచి వేరు చేసి పొడిగా, శుభ్రంగా, ప్రశాంతంగా ఉండే కొట్టంలో కట్టాలి. పొడిగా ఉండే ఎండు గడ్డిపై నిద్రించేలా చూడాలి.
- **ఎక్కువ పాల ఉత్పత్తినిచ్చే పశువులలో ఈనిన వెంటనే పాల జ్వరం రాకుండా చూలుతో ఉన్న సమయంలో కాల్షియం, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఇవ్వాలి.**
- ఈనడానికి ఒక వారం ముందు విటమిన్ డీ ఇంజెక్షన్ చేయించాలి.
- నీటి సంచి కనిపించిన రెండు గంటలకు కూడా దూడ కాళ్లు బయటకు రాకపోతే వెంటనే పశు వైద్యులకు తెలపాలి. వారు వచ్చి పశువు సులువుగా ఈనేలా చర్యలు తీసుకుంటారు. ఈనిన 24 గంటల లోపు మాయ పడకపోయినా కూడా పశు వైద్యుడిని సంప్రదించాలి.

జిల్లాలో పశువులు ఇలా..

పశువులు	సంఖ్య
గేదెలు	1,60,403
ఆవులు	75,839

సంరక్షణ ఇలా..

గర్భం దాల్చిన నాటి నుంచి పశువుకు, గర్భంలో పెరుగుతున్న దూడ సంరక్షణ అవసరం. గర్భం ధరించాక మొదటి రోజుల్లో కంటే చివరి రెండు నెలల్లో నాలుగు రెట్లు వేగంగా దూడ పెరుగుతోంది. చూడి పశువుల సంరక్షణలో పశు వైద్యాధికారులు, సిబ్బంది సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. పోషక విలువలతో కూడిన దాణా అందించాలి. ముఖ్యంగా చివరి రెండు నెలల్లో దాణాను పెంచడంతో పాటు పప్పు జాతికి చెందిన గడ్డి రూపంలో అధిక పోషకాలను అందించాలి. ఇలా చేయడం వల్ల దూడ పెరుగుదలకే కాకుండా పశువు ఈనిక తరువాత పాల దిగుబడి పెరుగుతుంది. చూడి పశువు ఈనే వరకూ పాలు తియ్యడం మంచిది కాదు. ఈనటానికి 2 నెలల ముందు అంటే చూడు కట్టిన 7వ నెల నుంచి పాలను తీయడం మానేయాలి. అలా చేయడం వల్ల ఈనిన తర్వాత పాల ఉత్పత్తి తగ్గదు. పుట్టిన దూడకు పొట్టలో పురుగులు, నట్టల సమస్య లేకుండా చూడి చివరి 3 నెలల్లో చూడి పశువుకు పురుగుల నిర్మూలన మందు వేయాలి. పాలు పితకడం ఆపిన తరువాత కాలంలో చూడి పశువు గణనీయంగా పెరిగేలా చూడాలి. చివరి రెండు నెలల్లో 40 నుంచి 60 కిలోల బరువు పెరగాలి.

కొండ చిలువకు చికిత్స



ప్రత్తిపాడులో కొండ చిలువకు చికిత్స చేస్తున్న ఏడీ బాలచంద్ర యోగేశ్వర్

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొండ చిలువకు ప్రత్తిపాడు ప్రభుత్వ పశు వైద్యశాలలో బుధవారం చికిత్స చేశారు. యర్రవరం – ఏలేశ్వరం రోడ్డు మార్గంలో మంగళవారం అర్ధరాత్రి 15 కిలోల బరువుతో సుమారు 8 అడుగుల పొడవున్న కొండ చిలువ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం దానిపై నుంచి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆ కొండ చిలువను అటవీశాఖ అధికారులు స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలకు తరలించారు. పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ ఆ కొండ చిలువకు చికిత్స చేశారు. చర్మం చిట్లిన నాలుగు చోట్ల కుట్లు వేసి, మూడు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు చెప్పారు. దీంతో అటవీశాఖ అధికారులు కొండ చిలువను రాజమహేంద్రవరంలోని అటవీశాఖ రిహేబిటేషన్ సెంటర్‌కు తరలించారు. ఈ వైద్య చికిత్సలో ధర్మవరం, ఒమ్మంగి ప్రభుత్వ పశు వైద్యశాలల వైద్యాధికారులు ఎస్.వరలక్ష్మి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్సీ-2024 పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

రాయవరం: త్వరలో జరిగే డీఎస్సీ-2024 పోటీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు జూలై 1వ తేదీ నుంచి ఉచిత కోచింగ్ అందించనున్నారు. ఈ విషయాన్ని తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ అధికారి పిల్లి సత్యరమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్ వద్ద నిర్వహించే ఉచిత కోచింగ్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులన్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఈ కోచింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులతో పాటు ప్రతి సబ్జెక్టుకు ప్రాక్టీస్ టెస్ట్, గ్రాండ్ టెస్ట్ కూడా నిర్వహిస్తామన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో లైబ్రరీ సౌకర్యం ఉందన్నారు. రెండు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులకు రూ.వెయ్యి విలువైన స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వడంతో పాటు, నెలకు రూ.1,500 స్టైఫండ్, బుక్ అలవెన్స్ అందజేయనున్నట్లు వివరించారు. డీఎస్సీ-2024 పోటీ పరీక్షకు సిద్ధపడుతున్న అభ్యర్థుల్లో అర్హత ఉండి, ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎస్జీటీ టెట్ క్వాలిఫైడ్ అర్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సెల్ఫ్ అడ్రస్ కవర్‌ను దరఖాస్తుకు జత చేసి ఈ నెల 30వ తేదీలోగా డైరెక్టర్, ఏపీ బీసీ స్టడీ సర్కిల్, నియర్ ఆర్ట్స్ కాలేజ్, రాజమహేంద్రవరం, పిన్‌కోడ్ 533133 చిరునామాకు పంపించాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు ఇతర వివరాల కోసం 0883 2421129, 93939 34825, 86394 47339 నంబర్లను సంప్రదించవచ్చని వివరించారు.

బాధితులకు మొబైల్ ఫోన్ల అందజేత

రాజమహేంద్రవరం సిటీ: రైళ్లలో దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ప్రక్రియలో భాగంగా ఫిర్యాదుదారులకు అందజేశామని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక జీఆర్పీ స్టేషన్‌లో రూ.4.60 లక్షల విలువైన 33 మొబైల్ ఫోన్లను బాధితులకు అందించామన్నారు. ఫోన్లను గుర్తించడంలో జీఆర్పీ ప్రత్యేక టీమ్ సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ పరిసర ప్రాంతాల్లో రికవరీ చేశామన్నారు.

టేకు కలప స్వాధీనం

నల్లజర్ల: అనుమతి పత్రాలు లేకుండా దూబచర్ల నుంచి కొయ్యలగూడేనికి వ్యాన్‌లో తరలిస్తున్న 45 టేకు దిమ్మెలను నల్లజర్ల శివారులో అటవీశాఖ డీఆర్వో వేణుగోపాల్ పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి వ్యాన్, టేకు కలపను రాజమహేంద్రవరం అటవీశాఖ డివిజన్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడిలో బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని కారు బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు



నల్లజర్లలో బైక్ ఢీకొనడంతో బోల్తాపడిన కారు

నల్లజర్ల: బైక్ కారును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. నల్లజర్ల గ్రామ శివారు పోతవరం వెళ్లే రహదారి అండర్‌పాస్ వద్ద నల్లజర్ల వైపు వస్తున్న కారును ఓ బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో కారు రెండు పల్టీలు కొట్టింది. మారెళ్లమూడికి చెందిన ఉపాధ్యాయురాలు రామలక్ష్మి కొయ్యలగూడెం నుంచి కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తుండగా, ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ నేపథ్యంలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఉపాధ్యాయురాలు రామలక్ష్మి, బైక్ నడుపుతున్న భీమడోలుకు చెందిన యువకుడు చోడిశెట్టి సంతోషకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెక్క.. ఇక పక్కా

- ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే పూర్తి
- కొత్తగా మరింత మంది గుర్తింపు
- భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు

రాయవరం: దివ్యాంగుల్లో మార్పు తెచ్చే సంకల్పానికి అడుగు పడుతోంది.. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్య అందించేందుకు ప్రతి భవిత కేంద్రం సిద్ధమైంది. ఈ కేంద్రాలకు రాకుండా ఇంటి వద్దే ఉంటున్న చిన్నారుల లెక్క తేల్చేందుకు గత నెలలో సమగ్ర శిక్షా అధికారుల పర్యవేక్షణలో చేపట్టిన సర్వే పూర్తయ్యింది. ఇందులో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ (ఐఈఆర్‌టీ) భాగస్వాములయ్యారు. దీనిద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మరికొంత మంది వెలుగులోకి వచ్చారు. వీరందరికీ ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు.

సచివాలయం యూనిట్‌గా..

ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఎంతమంది ఉన్నారనే వాస్తవ లెక్క తెలియని పరిస్థితి. కానీ, తాజాగా సచివాలయాన్ని యూనిట్‌గా చేసుకుని సమగ్ర సర్వే చేశారు. కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకూ నమోదైన 2,586 మందితో పాటు కొత్తగా గుర్తించిన 608 మంది ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 2,180 మంది విభిన్న ప్రతిభావంతులు ఉండగా, కొత్తగా 597 మందిని, తూర్పు గోదావరి జిల్లాలో 2,319 మంది ఉండగా, కొత్తగా 465 మందిని గుర్తించారు. వీరికి ఆధార్ కార్డుకు అనుసంధానం చేస్తూ, ఆయా పాఠశాలల యూ-డైస్ కోడ్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవ గణాంకాల్లో పారదర్శకతతో పాటు, వారు ఎక్కడ చదువుతున్నారనేది తెలుసుకునే అవకాశం ఉంటుంది.

భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ

జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు ఇద్దరు ఫిజియోథెరపిస్ట్‌లు ఉండగా, ప్రస్తుతం మరో ఐదుగురిని తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ పోస్టులకు 56 మంది దరఖాస్తు చేసుకోగా, వీరందరికీ ముఖాముఖీ నిర్వహించి ఎంపిక చేస్తారు. తద్వారా ఫిజియోథెరపీ సేవలు మరింత విస్తరిస్తారు. శారీరక, మానసిక వైకల్యంతో ఉన్న చిన్నారులు కావడంతో వీరికి ఆటపాటలతో చదువు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే అవసరమైన ఆట పరికరాలు, వస్తువులను కేంద్రాలకు సమకూరుస్తున్నారు. ప్రతి భవిత కేంద్రంలో ఇద్దరు ఐఈఆర్‌టీలు కేంద్రానికి వచ్చే చిన్నారులకు విద్యను అందిస్తారు. వీరితో పాటు ప్రతి కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. శారీరక వైకల్యం అధికంగా ఉన్న చిన్నారులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించేలా ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం ఫిజియోథెరపిస్ట్ విద్యార్థుల ఇళ్లను సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

భవిత కేంద్రాలు	: 22
పనిచేస్తున్న ఐఈఆర్‌టీలు	: 44
ప్రత్యేక అవసరాల పిల్లలు	: 2,586
భవిత కేంద్రాలకు వచ్చేవారు	: 485
హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పిల్లలు	: 220



గుర్తించిన విభిన్న ప్రతిభావంతుడిని భవిత కేంద్రంలో చేర్పిస్తున్న తల్లిదండ్రులు

నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ



భవిత కేంద్రాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. కేంద్రాల పనితీరును మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన తాజా సర్వేలో 608 మందిని గుర్తించాం. గుర్తించిన వారందరినీ భవిత కేంద్రాల్లో చేర్పిస్తున్నాం.

–ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్, అమలాపురం

ఫిజియోథెరపిస్ట్‌ల నియామకానికి చర్యలు



సమగ్ర శిక్షా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిజియోథెరపిస్ట్‌ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఐదు పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు 58 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారికి జూలై 4న జిల్లా జాయింట్ కలెక్టర్ వారి నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించాం.

–ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

అంగన్‌వాడీ నాయకులపై కేసు కొట్టివేత

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ నాయకులపై నమోదు చేసిన కేసును కోర్టు కొట్టివేసింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో 2013లో సిబ్బంది సమావేశం జరుగుతుండగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పేరుతో ఎం.వీరలక్ష్మి తదితరులు కార్యాలయంలోకి చొచ్చుకువచ్చారు. కేకలు వేస్తూ సమావేశం జరగనివ్వకుండా, ప్రభుత్వ విధులు నిర్వహించకుండా అడ్డుకున్నారని, సిబ్బందిని కార్యాలయంలో నిర్బంధించారని అప్పటి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఇమంది పార్వతి అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల సంఘ నాయకులు ఎం.వీరలక్ష్మి, ఆకుల అప్పలనర్స, ఇమంది వేమేశ్వరి, కాకరాపల్లి సునీతలపై పలు కేసులు నమోదు చేశారు. అనంతరం నలుగురిపై ప్రత్తిపాడు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా, కోర్టు పది మంది సాక్షులను విచారించింది. నేరం రుజువుకాకపోవడంతో న్యాయమూర్తి కాటం భాను కేసును కొట్టి వేస్తూ బుధవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో తమ వాదనలు వినిపించిన న్యాయవాది బుగత శివను నిందితులు శాలువాతో సత్కరించారు.

క్షుద్ర పూజలంటూ ప్రచారం

కాట్రేనికోన: కుండలేశ్వరం శివారు నక్కావారి పేటలో క్షుద్ర పూజలంటూ ప్రచారం జరగడం ఆ గ్రామంలో కలకలం రేపింది. ఇక్కడి పక్కా భవనంలో క్షుద్ర పూజలు చేస్తున్నారని, గుప్త నిధులు, అతీంద్రియ శక్తులు పొందేందుకు వీటిని చేస్తున్నారని పోలీసులకు ప్రజలు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ముమ్మిడివరం సీఐ కొండయ్య వివరించారు.

ఆవుల అక్రమ రవాణాపై పోలీసులకు ఫిర్యాదు



ఆవుల అక్రమ రవాణాపై పట్టణ ఎస్‌ఐ కిషోర్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న బజరంగ్‌దళ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఐదు ఆవులు, రెండు గేదె దూడలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని మంగళవారం రాత్రి బజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి పట్టుకున్న ఆవులు, గేదె దూడలను ఇందుపల్లి గోశాలకు తరలించారు. బజరంగ్ దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణం సమీపంలో ఈదరపల్లి టీటీడీ కల్యాణ మండపం వద్ద ఆవులు, గేదె దూడలను ఓ వాహనంలో తరలిస్తుండగా బండార్లంక బజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. వాహన డ్రైవర్‌ను బజరంగ్‌దళ్ కార్యకర్త బళ్ల సాయికృష్ణ ఈ ఆవులను ఎక్కడికి తరలిస్తున్నారని ప్రశ్నించినప్పుడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి వాహనాన్ని అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు జరిగిన ఘటనపై దర్యాప్తు నిర్వహించి ఆవులను రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ ప్రతినిధులు ఊటుకూరి సాంబయ్య, బండి శ్రీనివాస్, కాశిన ఫణీంద్ర, డాక్టర్ కొప్పుల నాగ మానస, ఈశ్వర్ గౌడ్, ఎ.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘కృషి’ ఫలితాలు అన్నదాతకు అందాలి

ఐసీఏఆర్- అటారి డైరెక్టర్ షేక్ ఎన్ మీరా



సదస్సులో వక్తలకు మెమెంటోలు అందజేస్తున్న ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ షేక్ ఎన్ మీరా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కృషి విజ్ఞాన కేంద్రాల్లో చేపట్టే ప్రతి కార్యక్రమం ఫలితం అన్నదాతకు చేరేలా డాక్యుమెంట్ రూపొందించాలని ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ సమావేశ మందిరంలో బుధవారం వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ జోన్-10 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సదస్సు రెండో రోజు ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల విస్తరణ కార్యక్రమాల్లో చేపట్టే పరిశీలనలు, ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలపై తగు రీతిలో డాక్యుమెంట్స్ చేసే విధంగా, ప్రతి రైతు వారికిచ్చిన రిపోర్టును చాలా సులభంగా అర్థం చేసుకునే వివిధ మాధ్యమాల్లో పొందుపరచాలని తెలిపారు. తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు పీపీ మురుగన్, తమిళనాడు యూనివర్సిటీ వెటర్నరీ సైన్సెస్ విస్తరణ సంచాలకుడు వి.అప్పారావు, ఐసీఏఆర్-అటారి ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఏఆర్ రెడ్డిలు ‘నూతన సామర్థ్యాలు మరియు నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ఎవిడెన్స్ సృష్టించడం- మంచి అలవాట్లు పంచుకోవడం’ టెక్నికల్ సెషన్స్‌లో కన్వీనర్లుగా వ్యవహరించారు. ఎంఎస్ నిమిష సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇన్నోవేషన్ అండ్ సైన్స్ పాలసీ డైరెక్టర్ డా.రోషన్‌సులేమాన్, ఐసీఏఆర్-అటారి కన్సల్టెంట్ సైంటిస్ట్ ఎం.ఉస్మాన్‌లు నూతన సాగు పద్ధతులను ఏ విధంగా డాక్యుమెంట్ చేయాలో తెలిపారు. ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ షేక్ ఎన్ మీరా, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు బి.ప్రమీలారాణిలు నెక్స్ట్‌జెన్‌స్కిల్లింగ్ ఫర్ యాక్సిలరేటింగ్ ఇంపాక్ట్స్ ఎక్స్‌ప్లోరింగ్ న్యూ హారిజన్స్ సెషన్స్‌కు చైర్మన్‌లుగా వ్యవహరించారు. ఎన్ఎఫ్ఎస్ఐ సీఈఓ ఎన్.సాయికృష్ణ ‘భావితరం నైపుణ్య కార్యక్రమాలతో గ్రామీణ- భారతదేశాన్ని ఆధునీకరించడం’పై, సెంటర్ ఫర్ గ్రోవర్-సెంట్రిక్ ఎకో వాల్యూ మెకానిజమ్స్ ఫౌండర్, డైరెక్టర్ ప్రాజేష్‌గుప్తా కర్నన వ్యవసాయ అవకాశాలపై, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ విన్యాస సేంద్రియ వ్యవసాయంలో వ్యాపార సౌలభ్యం, విస్తరణ నిపుణుల కోసం ఉత్తమ నైపుణ్యాలు, శివగరై కేవీకే హెడ్ సెందూర్‌కుమారన్ లైవ్ స్టాక్ గ్రీన్ మేనేజ్‌మెంట్ ప్రమోటర్ పశుగ్రాసాల యాజమాన్యం, నైపుణ్య శిక్షణపై, సీఎస్ఆర్ కన్సల్టెంట్ రాధామాధవ్‌మెల్ల సస్టైనబిలిటీ- కేవీకేలలో రైతాంగాన్ని ప్రభావితం చేసే సలహాలు, సహకారం కోసం సీఎస్ఆర్ నిధులపై ప్రజెంటేషన్ చేశారు. ఐసీఏఆర్-అటారి ప్రిన్సిపాల్ సైంటిస్ట్‌లు ఎ.భాస్కరన్, ఏఆర్ రెడ్డిలు స్వచ్ఛంద సంస్థలు కేవీకేలను నిర్వహించడానికి ఉత్తమ పద్ధతులపై మోడరేటెడ్ ప్యానెల్ చర్చకు మోడరేటర్లుగా వ్యవహరించారు. ఐసీఏఆర్-అటారి ఏఎఫ్అండ్ఏఓ ఎ.ప్రేమ్‌కుమార్ జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ మరియు హైబ్రీడ్ ఐఎస్ఏ మోడల్-1/1ఏ కింద కొత్త ఫండ్ మెకానిజంపై, ఐసీఏఆర్-అటారి ఏఏవో వీవీ రమణ కేవీకేల ప్రభావవంతమైన నిర్వహణ కోసం అడ్మినిస్ట్రేషన్ మార్గదర్శకాలపై అభిప్రాయాలను వివరించారు. అనంతరం ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డా.షేక్ ఎన్ మీరా వక్తలను మెమెంటోలతో సత్కరించారు. గురువారం ముగింపు సదస్సుతో పాటు కడియం నర్సరీల సందర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ ఈత పోటీలకు శ్రీసాయి ఎంపిక



ఈత పోటీలకు ఎంపికైన సాయిశ్రీని అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జూలై 7 నుంచి 11 వరకూ జరిగే జాతీయ స్థాయి జూనియర్ నేషనల్ స్విమ్మింగ్ వాటర్ పోల్ పోటీలకు కాకినాడ జిల్లాకు చెందిన శ్రీసాయి ఎంపికయ్యిందని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్ఏలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాయిశ్రీ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ పి.అప్పలనాయుడు వద్ద శిక్షణ పొందుతుందన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఆమెను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లాకు పతకాలు తేవాలని అభినందించారు. సాయిశ్రీని డీఎస్ఏ కోచ్‌లు సమీర్, రుద్ర, సురేష్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ శాఖ నుంచి జి.వెంకట్రావు, స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి ఐ.రాజు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: గుర్తు తెలియని వ్యక్తి (27) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 23న మృతి చెందాడని, దీనిపై వీఆర్వో గెద్దం వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. రాపాక పంచాయతీ పరిధి శ్రీరామనగరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి 20న అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఇతని పేరు కారాసు అరుణ్‌ప్రసాద్ (27)గా గుర్తించామన్నారు. ఇతనిది ఏ గ్రామం అనేది తెలియరాలేదని, మరిన్ని వివరాలకు 94409 04832 నంబరులో సంప్రదించాలని ఎస్సై వివరించారు.